

నేడు నగరంలో పలు ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

నగరంలోని పలు ప్రాంతాలలో శనివారం ఉదయం విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందని ఏపీఎస్పీడీసీఎల్ తిరుపతి ఆపరేషన్ ఈఈ చంద్రశేఖర రావు ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి పరిధిలో 33/11 కె.వి. నార్త్ సెక్షన్ లో ద్వారక నగర్ ఫెడర్‌లోని ఎన్.జిఓ కాలని, రామచంద్ర నగర్, ప్రశాంతి నగర్ , కె.టీ. రోడ్డు పరిసర ప్రాంతాలలో 11 కె. వి. లైన్లు, ఎల్.టి. లైన్లు, ట్రాన్స్ఫార్మర్లు, ట్రీ కటింగ్ వల్ల ఆటంకం కలుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

రాజ్యాంగం దేశానికి దిక్సూచి

జిల్లావ్యాప్తంగా అంబేద్కర్‌కు నివాళి

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, వారు రచించిన రాజ్యాంగం దేశానికి మార్గదర్శకం, దిక్సూచి అని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రెవెన్యూ డివిజనల్ అధికారి రామ్మోహన్, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికార అధికారి చెన్నయ్య, జిల్లా బిసి సంక్షేమ అధికారి చంద్రశేఖర్, పౌరసంబంధాల అధికారి బాలకొండయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తిరుపతి సిటి, యంత్రాంగం

మతోన్మాదుల నుంచి కాపాడుకుందాం : సిపిఎం

మతోన్మాదుల నుంచి భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, ఆర్‌పిఐ దక్షిణ భారత నాయకులు పి.అంజయ్య ఉద్ఘాటించారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం బృందం పూలమాల వేసి నివాళి అర్పించింది. రాజ్యాంగంలో ప్రతి పౌరుడికి సమాన అవకాశాలు ఉండాలని రిజర్వేషన్లు కల్పించడంలో అంబేద్కర్ పాత్ర చాలా కీలకమైనదని అన్నారు. ఆయన ఏ ఆశయాల కోసమైతే అహర్నిశలు శ్రమించి పనిచేశారో ఆ ఆశయాలకు నేడు గండి పడే విధంగా మతోన్మాదులు రాజ్యాంగానే మార్చి వేయడం కోసం తీవ్రమైన కషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి.సుబ్రమణ్యం, జిల్లా కమిటీ సభ్యులు, ఆర్ లక్ష్మి, కే వేణుగోపాల్ పాల్గొన్నారు. శ్రీకాళహస్తి ఆర్టీసీ కూడలి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం నేతలు పూలమాల వేసి నివాళి అర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, నాయకులు పెనగడం గురవయ్య, కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు ఆదర్శం : సిఎండి కె.సంతోషరావు

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భావితరాలకు ఆదర్శనీయమని ఎపిఎస్ పిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు పేర్కొన్నారు. ఎస్‌ఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సమ సమాజ స్థాపనకు ఎనలేని కషి చేశారన్నారు. సమాజంలో శాంతిని నెలకొల్పేందుకు ఆయన కషి అభినందనీయమని వివరించారు.

క్యాంపస్‌లో.. శ్రీ వెంకటేశ్వర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఎ చంద్రశేఖరన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. డాక్టర్ వెంకటేశ్వర్లు, డిఎస్‌ఎన్ మూర్తి, వెంకట రమణయ్య, జగదీష్‌బాబు, ఉమాదేవి పాల్గొన్నారు. ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో ఎస్‌పి సుబ్బరాయుడు నివాళి అర్పించారు. ఎస్వీయూలో విసి సిహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ మాదాల భూపతినాయుడు ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఎస్సీ, ఎస్టీ, బీసీ లైజాన్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు. శ్రీ పద్మావతి విశ్వ విద్యాలయంలో సెంటర్ ఫర్ అంబేద్కర్ స్టడీస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఐవి లలితకుమారి ఆధ్వర్యంలో జరిగింది. జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం రిజర్వేషన్ సెల్ ఆధ్వర్యంలో ఉపకులపతి ప్రొఫెసర్ జిఎస్‌ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు.

గూడూరుటౌన్‌లో... అండర్ బ్రిడ్జి కూడలి వద్ద అంబేద్కర్ విగ్రహానికి మాలమహానాడు నియోజకవర్గ కన్వీనర్ చింతల చిరంజీవి ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఎంపిడిఓ మధుసూదనరావు, ఎంపిపి గురవయ్య ఆధ్వర్యంలోనూ జరిగింది. గోగినేనిపురం వద్ద డివిజనల్ విద్యుత్ శాఖ కార్యాలయంలో ఇఇ నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. అంగన్‌వాడీ పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. అశోక్‌నగర్ వాటర్ ట్యాంకు వద్ద అంబేద్కర్ విగ్రహానికి ఎంఎల్‌ఎ సునీల్‌కుమార్ నివాళి అర్పించారు.

పుత్తూరు టౌన్‌లో... రిటైర్డ్ జడ్జి దొరస్వామి ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. అంబేద్కర్ సర్కిల్ దగ్గర అంబేద్కర్ విగ్రహానికి సబ్ రిజిస్ట్రార్ సుబ్రమణ్యం, అంబేద్కర్ ట్రస్టు భవన్ కార్యదర్శి, కోశాధికారి కుప్పయ్య, డాక్టర్ రాజేంద్ర, డి.మహేష్ పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో... ఎంఎల్‌ఎ నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. రేణిగుంటలో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ బ్రాంచ్ కార్యాలయంలో నివాళి అర్పించారు. ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు జూలియన్ రాజు ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. పెళ్లకూరులో ప్రధానోపాధ్యాయులు చిన్నబ్బాయి, ఉపాధ్యాయులు హరికృష్ణ, వినయ్ పాల్గొన్నారు. గూడూరులో కెవిపిఎస్ ఆధ్వర్యంలో దారా కోటేశ్వరరావు, అడపాల ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మాజీ ఎన్‌డిసిసిబి ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది.

భజరంగ్‌దళ్ రౌడీలను అరెస్టు చేయాలి

దళిత, రాజకీయ, ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఎస్వీ యూనివర్సిటీలో ప్రొఫెసర్ చెంగయ్యపై దాడిచేసిన భజరంగ్‌దళ్ రౌడీలను అరెస్టు చేయాలని అఖిలపక్షం డిమాండ్ చేశారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన్‌లో శుక్రవారం అఖిలపక్ష ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ప్రొఫెసర్ చెంగయ్యపై దాడిని వక్తలు ఖండించారు. దాడి జరిగి నాలుగు రోజులువుతున్నా దోషులను అరెస్టు చేయడంలో పోలీసులు ఎందుకు అలసత్వం ప్రదర్శిస్తున్నారని ప్రశ్నించారు. డిపార్టుమెంట్‌లో విధులు నిర్వహిస్తున్న ప్రొఫెసర్‌పై దాడిచేయడం, కారును ధ్వంసం చేసిన ఘటనలకు సంబంధించి వీడియోలు ఉన్నాయన్నారు. యూనివర్సిటీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకూ అరెస్టు చేయకపోవడం శోచనీయమన్నారు. బయటి వ్యక్తులు యథేచ్ఛగా యూనివర్సిటీలోకి అక్రమంగా ప్రవేశించడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆర్‌పిఐ దక్షిణ భారత అధ్యక్షులు పి.అంజయ్య, అంబేద్కర్ భవన్ ఛైర్మన్ పరమశివం, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, అంబేద్కర్ అకాడమీ ఛైర్మన్ ధనశేఖర్, టిటిడి ఉద్యోగ సంఘాల నాయకులు ప్రసాదరావు, టిటిడి కోఆపరేటివ్ బ్యాంక్ ఉపాధ్యక్షులు మహేష్, సిపిఎం నాయకులు కె.వేణుగోపాల్, ఎన్.శ్రీనివాసులు, బి.రవి, అశోక్ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని అధికారులు ఉద్ఘాటించారు. జిల్లావ్యాప్తంగా కోలాహలంగా సదస్సులు నిర్వహించగా, తిరుపతి కచపి ఆడిటోరియంలో జరిగిన సదస్సు జనం లేక వెలవెలబోయింది. చివరకు సచివాలయ సిబ్బందిని తీసుకొచ్చి సదస్సు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొనడం గమనార్హం. జిల్లా కేంద్రమైన తిరుపతిలో ప్రచారం లేకపోవడం వల్లనే ఇలా జరిగిందని సిపిఎం వ్యాఖ్యానించింది.

తిరుపతి అర్బన్ పరిధిలో శుక్రవారం కచ్చపి ఆడిటోరియంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ కేవలం నలుగురు మాత్రమే భూ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. తిరిగి మధ్యాహ్నం 2-5 గంటల మధ్య చాలా తక్కువ ఫిర్యాదులు వచ్చాయి. నగరంలో సదస్సుల గురించి కేవలం పత్రికా ప్రకటన చేయడమే తప్ప, ఎక్కడా ఆటోలను పెట్టి ప్రచారం చేయకపోవడం వల్లనే ఇలా జరిగిందని తెలుస్తోంది. వాస్తవానికి నగరంలో అనేక భూ సమస్యలు దీర్ఘకాలికంగా ఉన్నాయి. ప్రతి సోమవారం జరిగే 'స్పందన' కార్యక్రమంలోనూ రెవెన్యూ సమస్యలే అత్యధికంగా వస్తుంటాయన్నది అధికారుల లెక్కలే చెబుతున్నాయి. అయితే వాటిని పరిష్కరించడంలో అధికారుల చిత్తశుద్ధి అంతంతమాత్రంగానే ఉంది. నగరంలో 22ఎ సమస్య దీర్ఘకాలికంగా ఉంది. ముఖ్యంగా సుందరయ్యనగర్, రైల్వేకాలనీ, సప్తగిరినగర్, యశోదానగర్‌లలో 30 ఏళ్లుగా ఇళ్లు నిర్మించుకుని ఉంటున్నారు. వారికి ఇంతవరకూ రెవెన్యూ అధికారులు పట్టాలను ఇవ్వలేదు. జగనన్న భూ హక్కు పథకంలో తిరుపతి నగరంలో అనేకమందికి పట్టాలను ఇచ్చారు. అయితే భూమి మాత్రం ఇప్పటికీ చూపలేదు. తమ భూములు ఎక్కడున్నాయో చూపించాలంటూ గతంలోనూ రెవెన్యూ అధికారులను బాధితులు నిలదీసిన సందర్భాలు ఉన్నాయి. మంగళం బిటిఆర్ కాలనీ పరిధిలో జగనన్న లేఔట్‌లో పట్టాలు ఇచ్చారు తప్ప భూములు చూపలేదు. శెట్టిపల్లి భూ సమస్య గత 50 ఏళ్లుగా అలానే అపరిష్కృతంగా ఉంది.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను రెవెన్యూ సదస్సులు పరిష్కరించే దిశగా అధికారులు చొరవ చూపాలని కోరారు. జిల్లావ్యాప్తంగా ఉన్న భూ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే నగరంలో ఉన్న 24 డివిజన్లలోనూ సదస్సులు నిర్వహించాలని కోరారు. తిరుపతి నగరం మొత్తానికి కేవలం మూడు రోజులు మాత్రమే సదస్సులు నిర్వహిస్తే తూతూమంత్రంగానే తప్ప, సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ప్రశ్నించారు. సదస్సులు జరుగుతున్న విషయాన్ని విస్తారంగా ప్రచారం చేయాలన్నారు. సదస్సులు సక్రమంగా జరిగేలా ఆర్‌డిఓ, తహశీల్దార్, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. మంగళం ప్రాంతంలో రెవెన్యూ సర్వే అకాడమీకి కేటాయించిన 43 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని మంగళం బిటిఆర్ కాలనీ వాసులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించేలా సదస్సులు నిర్వహించాలని సిపిఎం వినతి

తిరుపతిలో ప్రచారం లేక వెలవెల

పుత్తూరులో...

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్‌ఎ డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని మన్నారు పోలూరు గ్రామ సచివాలయంలో జరిగింది. ఆర్‌డిఓ కిరణ్మయి పాల్గొన్నారు. వడమాలపేట మండలం కల్లూరులో ఎంఎల్‌ఎ గాలి భానుప్రకాష్, కలెక్టర్ వెంకటేశ్వర్ పాల్గొన్నారు. భూ సమస్యలపై ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే ఎలాంటి రుసుము ఉండబోదని, రెవెన్యూ సేవలు ఉచితంగా అందిస్తామని తెలిపారు. నాయుడుపేటలో తహశీల్దార్ ఎం.రాజేంద్ర ఆధ్వర్యంలో జరిగింది. పెళ్లకూరు మండలం పాలచూరులో నోషనల్ ఖాతాను రెగ్యులర్ ఖాతా చేయాలని ఇద్దరు, పట్టా భూములు ఇనాం భూములుగా మారాయని యథాస్థితిగా ఉండేలా చూడాలని రెండో అర్జీలు, అదే భూమి మాగాణి భూమి అయినప్పటికీ దాని స్వరూపం మారి ఉందని ఆరు వినతి పత్రాలు అందాయి. పరిశీలించి న్యాయం చేస్తామని తాసిల్దార్ ఎస్. ద్వారకానాథ్ రెడ్డి తెలియజేశారు. రామచంద్రాపురంలో ఎంఎల్‌ఎ పులివర్తి నాని ఆధ్వర్యంలో కమ్మపల్లిలో జరిగిన సదస్సులో 20 ఫిర్యాదులు అందాయి. బిఎన్ కండ్రిగలో తహశీల్దార్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో పుత్తేరి గ్రామం నుంచి తెర్రిపాడు గ్రామానికి లింక్‌రోడ్డు ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు.

దక్కిలిలో ఎంఎల్‌ఎ కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో నాగోల్ గ్రామంలో జరిగింది. ఈ కార్యక్రమంలో తహశల్దార్ ఎం శ్రీనివాసులు, టీడీపీ నాయకులు పోలంరెడ్డి కోటేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఏలేశ్వరం రామచంద్ర నాయుడు పాల్గొన్నారు

అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలి : ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్

గూడూరు డిపో పరిధిలో అక్రమ సస్పెన్షన్‌ను రద్దు చేయాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా కార్యదర్శి శివకుమార్ డిమాండ్‌చేశారు. నాయకులు కెవిఎస్ వాసు ఆధ్వర్యంలో డిపో ఎదుట నిరసన కార్యక్రమం రెండో రోజూ కొనసాగింది. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎన్‌వి కృష్ణ, శివకుమార్ మాట్లాడుతూ గూడూరు డిపో మేనేజర్ వైఖరిపై రీజినల్ మేనేజర్ దృష్టి సారించాలని, అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలన్నారు. ఉద్దేశపూర్వకంగా ఎస్‌డబ్ల్యుఎఫ్ సభ్యులను సస్పెండ్ చేసి డిపో మేనేజర్ వేధింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సస్పెన్షన్ రద్దు చేసేంత వరకూ ఉద్యమాలకు వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బివి రమణయ్య మాట్లాడుతూ అద్దె బస్సుల సిబ్బంది పట్ల, కార్మికుల పట్ల డిఎం దురుసు వైఖరి మార్చుకోవాలన్నారు. డిపోలో సాయంత్రం ఆరు దాటితే లైట్లు ఉండవని, చిమ్మచీకట్లు అలముకుని ప్రయాణికులకు భద్రత లేకుండా పోతుందన్నారు. ఉద్యోగ కార్మికుల పట్ల పక్షపాత వైఖరితో వేధింపులకు పాల్పడితే సహించబోమని హెచ్చరించారు. నాయకులు సురేష్, ఎస్‌డబ్ల్యుఎఫ్ సభ్యులు పి.కిరణ్, వైఎస్ రాజు, పి.రమణయ్య, ఎస్‌కె బాషా, పి.రవీంద్రయ్య, ఎంఎస్ వాసు, ఎస్.కృష్ణయ్య, ఎ.పెంచలయ్య, ఆర్.భాస్కర్, పి.రవీంద్ర, సుకుమార్, వి.అజంత, ఎస్‌డి జబీన్ తదితరులు పాల్గొన్నారు.

పంచమి తీర్థానికి పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం చివరి రోజు పంచమి తీర్థం (చక్రస్నానం) వేడుకగా జరిగింది. ఉదయం 7-8 గంటల మధ్య అమ్మవారు పల్లకిలో ఆలయ నాలుగు మాడావీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఉత్సవర్లను ఊరేగింపుగా పంచమి తీర్థ మండపానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా శ్రీ వేంకటేశ్వర స్వామివారు కానుకలు పంపారు. రూ.1.11 కోట్ల విలువ చేసే 3 కేజీల బరువు గల బంగారు పాండియన్ కిరీటం, డైమండ్ నక్లెస్, రెండు డైమండ్ గాజులు, డైమండ్ కమ్మల జత, బంగారు గజలక్ష్మి పథకం సారెతో పాటు తిరుపతి పురవీధులలో ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఈవో శ్యామలరావు ఆధ్వర్యంలో అలంకరించారు. ఉదయం 10-11 గంటల మధ్య వేడుకగా స్నపన తిరుమంజనం జరిగింది. అమ్మవారికి అలంకరించిన పూలమాలలు, కిరీటాలు భక్తులను కనువిందు చేశాయి. వడ్ల గింజలు, పసుపు గడ్డలు, వట్టి వేరు, బ్లాక్ గ్రేప్స్, రోజ్ పెడల్స్, తులసి మాలలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తమిళనాడులోని తిరుపూర్‌కు చెందిన దాతలు ఈ మాలలను విరాళంగా అందించారు. రాత్రి 7.30 గంటలకు బంగారు తిరుచ్చిపై అమ్మవారు వాహనంలో ఊరేగారు. అనంతరం రాత్రి 10-11 గంటల మధ్య శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం జరిగింది. శనివారం సాయంత్రం 5-8 గంటల మధ్య పుష్పయాగం వైభవంగా జరగనుంది. నవంబర్ 28 నుంచి ప్రారంభమైన అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు పంచమి తీర్థంతో విజయవంతంగా జరిగాయని ఈవో శ్యామలరావు వెల్లడించారు. లక్షలాదిమంది భక్తులు పుష్కరిణిలో చక్రస్నానం చేశారన్నారు.

ఈ కార్యక్రమంలో తిరుమల పెద్ద జీయ్యర్ స్వామి, చిన్న జీయ్యర్ స్వామి, టీటీడీ ఛైర్మన్ బి.ఆర్.నాయుడు, ఈవో జె.శ్యామలరావు దంపతులు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, చంద్రగిరి ఎంఎల్‌ఏ పులివర్తి నాని, సివిఎస్‌వో శ్రీధర్, ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏవీఎస్వో సతీష్ కుమార్, ఏఈఓ దేవరాజులు, ఆలయ అర్చకులు బాబు స్వామి, సూపరింటెండెంట్ రమేష్ పాల్గొన్నారు.

శాప్ ఛైర్మన్‌ను కలిసిన విద్యార్థిసంఘాల నాయకులు

ప్రజాశక్తి - క్యాంపస్

శాప్ ఛైర్మన్ అమినేని రవినాయుడును విద్యార్థిసంఘాల నాయకులు శుక్రవారం కలిసారు. ఎస్వీయూలోని ఆర్ట్స్, సైన్స్, ఇంజినీరింగ్, లా రీసెర్చి స్కాలర్స్ దాదాపు 300 పైగా ఎటువంటి ఫెలోషిప్‌లు రానివారికి నాన్ నెట్ ఫెలోషిప్‌లు 15వేలు ఇచ్చేలా అధికారులతో చర్చించాలని కోరారు. గత ప్రభుత్వం విద్యార్థిసంఘం నేతలపై పెట్టిన అక్రమ కేసులను కొట్టివేయాలని విజ్ఞప్తి చేశారు. తాజాగా వర్సిటీలో జరిగిన మతోన్మాదుల దాడి, మత ప్రచారం వంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అమినేని రవినాయుడు స్పందిస్తూ రిజిస్ట్రార్ భూపతినాయుడుతో ఫోన్‌లో మాట్లాడారు. నాన్ నెట్ ఫెలోషిప్‌లు ఇచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ తిరుపతి జిల్లా అధ్యక్షులు అక్బర్, టిఎన్‌ఎస్‌ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు కొట్టె హేమంత్‌రాయల్, క్యాంపస్ అధ్యక్షులు రామకృష్ణనాయుడు, ఎన్‌ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి జెన్నే మల్లికార్జున, నాయకులు అశోక్, వినోద్, శ్రీరామ్, గంగాధర్, కుమార్ పాల్గొన్నారు.

సంఘమిత్రులుగా కొనసాగించండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తొట్టంబేడు మండలంలోని పొయ్య, లింగమనాయుడుపల్లి, తాటిపర్తి, కొణతనేరి, కాసరం పంచాయతీల సంఘమిత్రలను యథావిధిగా వారి విధుల్లో కొనసాగించాలంటూ రాష్ట్ర హైకోర్టు తీర్పు వెలువరించింది. ఆ తీర్పును అమలు చేయాలంటూ సంబంధిత సంఘమిత్రలు సిఐటియు నాయకులతో కలిసి శుక్రవారం వెలుగుశాఖా పీడీకి వినతి పత్రం అందజేశారు. వివరాల్లోకి పోతే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శ్రీకాళహస్తి నియోజకవర్గంలో స్కీం వర్కర్లపై రాజకీయ ఒత్తిళ్లు అధికమయ్యాయి. పలువురు సంఘమిత్రలపై తప్పుడు ఫిర్యాదులు చేయించి విధుల నుంచి తొలగించే ప్రయత్నం చేశారు. ఇందులో భాగంగా తొట్టంబేడు మండలంలోని పొయ్య సంఘమిత్ర మహాలక్ష్మి, లింగమ నాయుడుపల్లి సంఘమిత్ర భూలక్ష్మి, తాటిపర్తి సంఘమిత్ర రేవతి, కొణతనేరి సంఘమిత్ర సరస్వతి, కాసరం సంఘమిత్ర మాధవిలు పెద్ద ఎత్తున రాజకీయ, అధికార ఒత్తిళ్లకు గురయ్యారు. దీంతో వీరంతా రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు సంఘమిత్రల వాదనను సమర్థిస్తూ వారిని యథావిధిగా విధుల్లో కొనసాగించాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాకుండా వారికి బకాయి పడ్డ వేతనాలను వెంటనే చెల్లించాలంటూ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర హైకోర్టు తీర్పుపై సిఐటియు జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య హర్షం వ్యక్తం చేశారు. అధికార దుర్వినియోగానికి పాల్పడ్డ వారికి రాష్ట్ర అత్యున్నత న్యాయస్థాన తీర్పు చెంపపెట్టులాంటిదని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జిబిఎస్ మణ్యం, జిల్లా కార్యదర్శి జయచంద్ర పాల్గొన్నారు.

రాష్ట్ర హైకోర్టు తీర్పుతో సిఐటియు హర్షం

సామాజిక తనిఖీ సభ 'మమ'

ఫిర్యాదుదారులు లేక 'వెలవెల'

ఒకరు సస్పెన్షన్

రూ.1.36 లక్షలు రికవరీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తొట్టంబేడు మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ ఫిర్యాదుదారులు లేక వెలవెల బోయింది. బహిరంగ సభలో సగం ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. వచ్చామా..వెళ్ళామా అన్న రీతిలో బహిరంగ సభ జరిగిందన్న విమర్శలు వచ్చాయి. 17వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సభకు అధ్యక్షులుగా ఆ మండల ఎంపీడీవో సురేంద్రనాథ్ వ్యవహరింఎవనిఅ. ముఖ్యఅతిథిగా డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్ హాజరయ్యారు. మొత్తం 27 పంచాయతీల్లో జరిగిన రూ.7.12 కోట్ల నిధులతో పూర్తి చేసిన పనులపై 12 మంది డీఆర్పీలు సామాజిక తనిఖీలు నిర్వహించారు. ఆ వివరాలు బహిరంగ సభలో వెల్లడించారు. కాసరం ఫీల్డ్ అసిస్టెంట్ బాలసుబ్రమణ్యం మస్టర్లలో ఒకే సంతకాలు ఉండడం, కుటుంబ సభ్యుల పేర్లను గుర్తించడంతో ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్లు పిడి తెలిపారు. రూ.1.36 లక్షల రికవరీకి ఆదేశించారు. అదేవిధంగా పలువురు ఉపాధి సిబ్బందికి రూ. 45 వేలు జరిమానా విధించారు. ఏదిఏమైనా ప్రజలు చైతన్యవంతులై సభల్లో నిలదీయాల్సిన అవసరం ఉంది.

సామాజిక తనిఖీలో డ్వామా పీడీ, జనం లేక ఖాళీ కుర్చీలు

క్రీడలతో మంచి ఆరోగ్యం: ప్రిన్సిపాల్

విద్యార్థికి బహుమతి అందిస్తున్న ప్రిన్సిపాల్ బాలరాజు చంద్రమౌళి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని పుత్తూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలరాజు చంద్రమౌళి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎ దిలీప్, టి ఉదయ్ కుమార్, కె శ్రీనివాసులు శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారు. శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ ఫుట్‌బాల్ జట్టులో భాగంగా పుత్తూరు విద్యార్థులు ఈనెల 21వ తేదీ నుండి 29వ తేదీ వరకు కేరళలో కాలికట్ అంతర విశ్వవిద్యాలయ క్రీడల (సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ గేమ్స్)లో పాల్గొన నున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలరాజు చంద్రమౌళి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధిక జనాభా వున్న భారతదేశం క్రీడారంగంలో వెనుకబడి ఉండడం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కోటేశ్వరయ్య, వ్యాయామ విభాగ అధ్యాపకులు బి సురేష్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకాలు జ్ఞాననేత్రాలు..

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: పుస్తకాలు జ్ఞాననేత్రాలు అని మనం ఎంత చదివితే అంత జ్ఞానం లభిస్తుందని, మానసిక వికాసానికి పుస్తక పఠనం దోహదం చేస్తుందని అమృత భారతి ఫౌండేషన్ చిత్తూరు సమన్వయకర్త, శతావధాని ఆముదాల మురళి అన్నారు. మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన అనంతరం ప్రధానోపాధ్యాయులు రూపేష్ కుమార్ అధ్యక్షతన 9, 10వ తరగతి విద్యార్థులకు రామాయణం, పెద్దబాలశిక్ష పుస్తకాలను శతావధాని ఆముదాల మురళి, సభ్యులు లోకేష్ లు అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మార్చిలో నిర్వహిస్తున్న పదవతరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి విద్యార్థులు మెరుగైన ఫలితాల సాధనకు తగు మెలకువలు, సూచనలు అందించారు. అనంతరం విద్యార్థులు పుస్తకాల ప్రాధాన్యతను, జీవిత విలువలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, సురేష్ బాబు, నాదెండ్ల మురళి, ఒబ్బుదేవి ప్రసాద్, వేణుగోపాల్, దాసు, మాధవీలత, దేవేంద్ర, జగన్నాథం పాల్గొన్నారు.

డిప్యూటీ డిఈవోగా సనత్ కుమార్ బాధ్యతలు

డిప్యూటీ డిఈవోగా బాధ్యతలు చేపట్టిన సనత్‌కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండల విద్యాశాఖ అధికారి–1 గా పనిచేస్తున్న సనత్ కుమార్ శుక్రవారం డిప్యూటీ డిఈఓగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

యోగా ఉచిత శిక్షణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా నూతన యోగా (ధ్యానం) కేంద్రాన్ని రిటైర్డ్ హెచ్ఎంలు నాగయ్య, రామలింగం, సుబ్రహ్మణ్యంలు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన యోగా మాస్టర్ రమేష్ జీ మాట్లాడుతూ యోగా వల్ల మానవాళికి కలిగే సంపూర్ణ ఆరోగ్యం గురించి వివరించారు. ధ్యానం మాస్టర్ మల్లీశ్వరి మాట్లాడుతూ ధ్యానం వల్ల కలిగే మానసిక ప్రశాంతత, ఏకాగ్రతల గురించి అవగాహన కల్పించారు. నిత్యం ఉదయం ఉచితంగా యోగా, ధ్యానం శిక్షణ ఇవ్వనున్నట్లు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రామలింగం తెలిపారు. అనంతరం ధ్యాన కేంద్రం చుట్టూ మొక్కలు నాటి పచ్చదనం పెంపు కార్యక్రమాన్ని చేపట్టారు.అనంతరం కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు .

మినీ గోకుల నిర్మాణాలు వేగవంతం చేయాలి: డ్వామా పీడీ

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలో ఉపాధి హామీ ద్వారా చేపడుతున్న 25 మినీ గోకులం షెడ్లులో కొన్ని నత్తనడకన నడుస్తున్నాయని నిర్లక్ష్యం వహించకుండా డిసెంబర్ 13వ తేదీ లోపు పూర్తి చేయాలని డ్వామా పీడీ సివి శ్రీనివాస్ ప్రసాద్ ఆదేశించారు. రైతు మినీ గోకులంతో పాటు కనీసం 25 సెంట్లులో పశువులకు గడ్డి ఉపాధి ద్వారా పెంపకం చేపడితే రైతుకు ఆసరాగా ఉంటుందన్నారు. ఏర్పేడు మండలంలో 32 సిమెంట్ రోడ్లు మంజూరు కాగా 3 పనులు మాత్రమే పూర్తి చేశారని మిగతా 29 సిమెంట్ రోడ్ల పనులను వేగవంతం చేయాలని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ ఆదేశించారు. ఏర్పేడు పంచాయతీ మినీ గోకులం తనిఖీలో అదనపు కార్యక్రమాధికారులు చంద్రశేఖర్‌రాజు, అవిలాల దేవరి, జెఈ బాలాజీ రావు పాల్గొని రైతులకు దిశా నిర్దేశం చేశారు.

శిలాఫలకం వేశారు..రోడ్డు మరిచారు..!

దుస్థితిలో వున్న రోడ్డు

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలోని రాచపాలెం గ్రామంలో 2021వ సంవత్సరంలో నూతన రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి శిలాఫలకం వేశారు. కానీ ఆ మార్గంలో ఏర్పాటు చేయాల్సిన రోడ్డు ఇంతవరకూ వేయలేదని, వర్షాలు పడినప్పుడు రోడ్డు మరమ్మతులకు గురయి ప్రజలు, విద్యార్థులు రాకపోకలకు ఇబ్బందిగా మారుతోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి తమ గ్రామానికి రోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'గిరిజనులకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలి '

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్రంలోని గిరిజనులకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు అక్కులప్ప నాయక్ డిమాండ్ చేశారు. రాష్ట్ర సచివాలయంలో సీఎం నారా చంద్రబాబును కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజన, ఆదివాసి విద్యార్థుల పలు రకాల సమస్యలను చర్చించినట్లు వెల్లడించారు. వర్సిటీలలో, ప్రభుత్వ సంస్థలలో ఖాళీగా ఉన్న బ్యాక్లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. రాష్ట్రంలో 17 విశ్వ విద్యాలయాల్లో నియమించే ఉపకులపతుల పదవులలో ఎస్టీలకు అవకాశం కల్పించాలని సూచించారు. గిరిజనుల అభివృద్ధి కోసం గిరిజన ప్రాంతాలలో తాగునీటి, రోడ్డు, అవస్థాపన సౌకర్యాల కోసం ప్రత్యేకమైన నిధులు కేటాయించాలని కోరినట్లు తెలిపారు.

మాట్లాడుతున్న ఎంఈవో ప్రేమలత

ప్రత్యేక ప్రతిభావంతులను ప్రోత్సహించండి

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలోని స్థానిక ప్రాథమిక పాఠశాలలో సమగ్ర శిక్షా వారిచే నిర్వహించిన ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈఓ ప్రేమలత మాట్లాడుతూ ప్రత్యేక ప్రతిభావంతులను చిన్నచూపు చూడొద్దని చూడరాదని, వారిని ప్రోత్సహిస్తే అద్భుత ఫలితాలు అన్ని రంగాలలో చవిచూస్తామని కొనియాడారు. విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అందిస్తున్న పతకాలను వినియోగించుకోవాలని, భవిత కేంద్రంలో దివ్యాంగుల కోసం ప్రత్యేక సేవలు అందిస్తున్నారని తెలిపారు.

బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి -రామచంద్రాపురం(చంద్రగిరి:): ఏనుగుల కారణంగా పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ. రామానాయుడు డిమాండ్ చేశారు. తిరుపతి ,చిత్తూరు జిల్లాలలో ఏనుగుల నుండి రైతులను, రైతులు వేసుకున్న పంటను కాపాడాలని లేని పక్షంలో రైతు సంఘం ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధంగా ఉందన్నారు. పది రోజులుగా చిత్తూరు, తిరుపతి జిల్లాలలో ఏనుగుల గుంపు రైతు పొలాలపై పడి పంటలను ధ్వంసం చేస్తూ ఉంటే ఫారెస్టు రెవెన్యూ అధికారులు ఎవరికి ఊడిగం చేస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. చిన్నగొట్టిగల్లు మండలం పరిసర గ్రామాలలో ఏనుగుల గుంపు పడి ధ్వంసం చేసిన రైతులు పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులను అడిగి తెలుసుకున్నారు.

యమ డేంజర్!

- గ్యాస్ పైపులైను గుంతలో ఇరుక్కున్న లారీ
- కెటి రోడ్డులో ప్రమాదకరం
- నిద్రావస్థలో అధికారులు

ప్రమాదకర స్థితిలో గ్యాస్ పైపులైను గుంతలో ఇరుక్కుపోయిన లారీ

ప్రజాశక్తి-బుచ్చి నాయుడు కండ్రిగ: గ్యాస్ పైపులైను కోసం తవ్విన గుంతలు ప్రమాదకరంగా మారుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా వుండడంతో తరచూ వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి గ్యాస్ పైపు లైను గుంతలను పూడ్చివేయాల్సి వున్నా నిర్లక్ష్యంతో నిద్రావస్థలో వుంటూ ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. ఫలితంగా గ్యాస్ పైపు లైను గుంతలో ఓ లారీ ఇరుక్కుపోయి నానా తంటాలు ఎదుర్కొంటున్నాయి.

బుచ్చినాయుడు కండ్రిగ మండలం కారణి మిట్ట వద్ద వున్న గ్యాస్ పైప్ లైన్ గుంతలో శుక్రవారం ఓ లారీ కూరుకుపోయింది. ఈ కారణంగా వాహనదారులు ఆయోమయంతో భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. శ్రీకాళహస్తి, తడ రోడ్డు నుంచి పాండూరు రోడ్డు మార్గం వరకు రోడ్డుకు ఇరువైపులా పెద్ద పెద్ద గుంతలు తియ్యడం వల్ల భయం గుప్పెట్లో పెట్టుకుని వాహనాలను నడపాల్సిన పరిస్థితి నెలకొంది. 'ఉరుకుతున్న నీటితో ఉంటే సంగతి' అన్న చందంగా వుంది. వర్షాకాలంలో గుంతలు తియ్యడంపై వాహన దారులు నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు నిద్ర మత్తు వదిలి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వర్షాకాలంలో రోడ్డుకి ఇరువైపులా గుంతలు తియ్యడం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని పలు పత్రికలో ముందే వార్తల రూపంలో హెచ్చరించినా ఫలితం శూన్యం. ఇకనైనా తీరు మారుతుందో లేదో చూడాల్సిందే.

మా ఊరికి రోడ్డు వేయండి సారూ..!

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలోని మోదుగుల పాలెం మీదుగా సిద్దయ్యగుంటకు వెళ్లే రహదారి గ్రావెల్ రోడ్డు ఫెంగల్ తుపాన్ కారణంగా పూర్తిగా మరమ్మతులకు గురైంది. పిల్లలు స్కూలుకి వెళ్లాలంటే ఇబ్బందికరంగా మారింది. స్కూలు వ్యాను వెళ్లాలన్నా గ్రామస్తు_లకు అత్యవసర పరిస్థితిలో అంబులెన్స్ రాలేని పరిస్థితిని ఎదుర్కొంటు న్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా అత్య వసర పరిస్థితిలో హాస్పిటల్‌కి వెళ్లాలంటే అంబులెన్స్ రాలేక సుమారు రెండు కిలోమీటర్ల మేర చిన్నపాటి రోడ్డు మీద ప్రయాణించి మోదుగులపాలెంకు వెళితే తప్ప హాస్పిటల్‌కి చేరుకోలేని పరిస్థితి ఏర్పడింది. దీనిపై పలుమార్లు అధికారులకు తెలిపినా ఎలాంటి పరిష్కారం చూపడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఉపాధి హామీ ద్వారా ఏర్పేడు మండలంలో మంజూ రు అయిన 32 సిమెంట్ రోడ్లు ఎలాంటి సమస్యలూ లేని కొన్ని గ్రామాలకు కూడా వచ్చాయని, అయితే రోడ్డు అస్తవ్యస్తంగా వున్న తమ గ్రామానికి మాత్రం ఇవ్వడానికి అధికారులకు కన్పించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దుస్థితిలో వున్న మోదుగుల పాలెం రహదారి

ఎస్‌వియూలో చెత్తాచెదారం తొలగింపు

'ప్రజాశక్తి'వార్తకు స్పందన

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఐదు రోజులుగా నిరంతరం కురిసిన వర్షాలతో తిరుపతి నగరాన్ని ముంచెత్తిన ఫెంగల్ తుపాను కారణంగా 'ఎస్‌వియూలోని పలు కళాశాలల భవనాలు వర్షపు నీటితో ఉరుస్తున్నాయి..' అనే వార్త మూడు రోజుల క్రితం ప్రజాశక్తిలో ప్రచురిత మైంది. దీనికి సంబంధించి ఆర్థిక శాస్త్ర విభాగం విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు ప్రకాశం భవనంపై వున్న అపరిశుభ్రతను తొలగించారు. ఈ వార్తను చూసిన ఎస్‌వియూ రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ప్రకాశం భవనంలో నీటిని ఉరుస్తున్న భవనాలను, ఆర్థిక శాస్త్ర విభాగాన్ని పరిశీలించారు. వర్సిటీలోని పలు కళాశాలల భవనాల పైన ఉన్న చెత్తాచెదారం తొలగించారు. నీరు నిలువలేకుండా తగిన చర్యలు తీసుకోవాలని వర్సిటీ ఇంజనీర్ తాండవ కృష్ణకు సూచించారు. వర్సిటీలో ఎక్కడా ఎలాంటి సమస్యలు వచ్చినా తక్షణమే స్పందిస్తామని, విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని రిజిస్ట్రార్ పేర్కొన్నారు. ఈ పరిశీలనలో ఆయన వెంట ఎస్వీయు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సుధారాణి, ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి ఆచార్య సునీత, ఆచార్య రాధిక, అకాడమిక్ కన్సల్టెంట్లు పాల్గొన్నారు.

ఉరుస్తున్న భవనాలను పరిశీలిస్తున్న యూనివర్సిటీ అధికారులుల

సమస్యల సుడిగుండంలో గురుకుల పాఠశాల

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: సత్యవేడు నియోజకవర్గం బిఎన్ కండ్రిక మండలం కణమనం బేడు పంచాయతీలో వున్న ఏకలవ్య గురుకుల పాఠశాలలో విద్యార్థులు సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడు తున్నారు. పట్టించుకోవాల్సిన విద్యాశాఖ అధికారులు, స్థానిక ప్రిన్సిపాల్ విద్యార్థులు తమ సమస్యలను రాతపూర్వకంగా ప్రిన్సిపల్ దృష్టికి తీసుకెళ్లినా కనీసం పట్టించుకోకపోవడం విడ్డూరం. విద్యార్థులకు రెండు నెలల్లో పరీక్షలు రాబోతున్నా ఇప్పటికీ సిలబస్ పూర్తి కావడం లేదు. ఉపాధ్యాయులు చెబుతున్న సిలబస్ విద్యార్థులకు అర్థం కావడం లేదని వాపోతున్నారు. ఉత్తరప్రదేశ్, హర్యానా రాష్ట్రాల నుండి వచ్చిన ఉపాధ్యాయుల భాష విద్యార్థులకు తెలియడంలేదు. విద్యార్థులకు భాష సమన్వయం లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. దీంతో ఉపాధ్యాయులు రెండు గ్రూపులుగా విడిపోయి విద్యార్థులను అడ్డం పెట్టుకొని వారిని పావులుగా వాడుకోవడం వల్ల ఈ సమస్య పదే పదే వస్తోంది. స్థానిక ఎమ్మెల్యే పర్యటించినప్పటికీ ఇక్కడ సమస్యలు కొలిక్కి రావడం లేదు. ఎప్పటికైనా ఈ సమస్యపై విద్యాశాఖ మంత్రి లోకేష్ స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని దళిత గిరిజన నాయకులు పులి శ్రీకాంత్, చందమామల కోటయ్య, కత్తి ధర్మయ్య, జనమాల గురవయ్య, విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు బావులూరు నాగరాజు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలకు 'బిసీఎం' విద్యార్థి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఈ నెల 8 నుండి 11వ తేదీ వరకు మూడు రోజుల పాటు మంగళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 17 బేస్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలలో మంగళం బాలచంద్ర మెమోరియల్ హైస్కూల్(బిసిఎం) విద్యార్థి పూజిత్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ ప్రియ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. పాఠశాల వ్యవస్థాపకులు కృష్ణమూర్తి నాయుడు పూజిత్‌కు అభినందనలు తెలిపి మాట్లాడుతూ ఇలానే అన్ని క్రీడలలో పాల్గొని మంచి విజయం సాధించాలని ఆకాంక్షి స్తు న్నామన్నారు. కరస్పాండెంట్ ప్రియ మాట్లాడుతూ విద్యార్థుల్లో మరింత కృషి, పట్టుదల అలవర్చు కుని రానున్న పోటీల్లో మంచి విజయాన్ని సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ సుకన్య, వ్యాయామ ఉపాధ్యాయు రాలు ప్రమీల, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న

ఘనంగా సాయి నర్సింగ్ కళాశాల అధినేత జన్మదినం

ప్రజాశక్తి -పుత్తూరు టౌన్ : పుత్తూరు కాలేజ్ ఆఫ్ సాయి నర్సింగ్ కాలేజ్ అధినేత రాకేష్ కిరణ్ జన్మదిన సందర్భంగా పట్టణంలోని స్థానిక అంబేద్కర్ భవనంలో అంబేద్కర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. అంబేద్కర్ ట్రస్ట్ కార్యదర్శి అపరంజి, ట్రెజరర్ కుప్పయ్య, ట్రస్ట్ సభ్యులు కలిసి రాకేష్ కిరణ్‌కు శాలువా కప్పి ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాకేష్ కిరణ్ పేద, బడుగు వర్గాల పిల్లలకు అనేక సేవలు అందిస్తున్నారని, అలాంటి వ్యక్తి నిండు నూరేళ్ల చల్లగా ఆయురారోగ్యాలతో ఉండాలని మరెన్నో పుట్టినరోజులు నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ట్రస్ట్ కార్యదర్శి, విశ్రాంతి జడ్జి దొరస్వామి, మహేష్, బాలసుబ్రహ్మణ్యం, డాక్టర్ రాజేంద్ర, కే విజయ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య, మావిల్లయ్య, డాక్టర్ గుణశేఖర్, ప్రభాకర్, రమేష్, షణ్ముగం, పాల్గొన్నారు.

విద్యార్థులు గ్రామ ప్రజలు కార్మిక సంఘ నాయకులు, స్వచ్ఛంద సంస్థ నాయకులు విద్యా సంస్థ అధినేత, వైసిపి యువ నాయకులు రాకేష్ కిరణ్‌కు పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నూకతోటి రాజేష్ కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. ఆయనను అభినందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, మండల కన్వీనర్ సొరకాయలు వైసిపి నాయకులు త్రివేంద్రం ,అనాధరై, మంజునాథ్ ,అశోక్, చీరాల, వాసు ,రజిని, కైలాసం, కోదండపాణి, వెంకటేశు, ప్రభాకర్, డేవిడ్, సుందరం, గోకుల్, గోవిందస్వామి. పాల్గొన్నారు.

సాయి నర్సింగ్ కాలేజి అధినేత రాకేష్ కిరణ్‌ను సన్మానిస్తున్న అంబేద్కర్ ట్రస్ట్ సభ్యులు

ఫ్రైడే 'డ్రైడే'తో జ్వరాలకు చెక్

ప్రాథమిక వైద్యాధికారి దివాకర్

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: ఫ్రైడే 'డ్రైడే'తో జ్వరాలకు చెక్ పెట్టవచ్చని ప్రాథమిక వైద్యాధికారి దివాకర్ పేర్కొన్నారు. బుచ్చినాయుడు మండలం పిహెచ్‌సిలో ప్రతి శుక్రవారం నిర్వహించే ఫ్రైడే డ్రైడేలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ దివాకర్, ఆరోగ్య అధికారి డిఎన్ వెంకటేశ్వర్లు మండలంలోని వెస్ట్ వరత్తూరు పంచాయతీ కొత్త కండ్రిగను సందర్శించారు. ప్రతి శుక్రవారం నీటి తొట్టెలు, డ్రమ్ములు, బిందెలు, బకెట్లు, సంపులు, ఓవర్ హెడ్ ట్యాంకులు లోని నీటిని పారబోసి మళ్లీ పట్టుకోవడం ద్వారా వాటిలో ఉన్న దోమ గుడ్లు లార్వా, ప్యూపాలు నాశనమై దోమలు నివారణ అవుతాయన్నారు. ఇంటి చుట్టూ ప్లాస్టిక్ కప్పులు, టెంకాయ చిప్పలు, రోళ్లు, పనికిరాని కుండలు, టైర్లు, డబ్బాలు, కూలర్లు వుంటే వాటిని దూరంగా పడవేయాలని సూచించారు. వేపాకు వేసుకుని దోమల నుండి రక్షించు కోవ చ్చునని తెలిపారు. కాచి చల్లార్చిన నీటిని వడపోసి తాగడం ద్వారా టైఫాయిడ్ విరేచనాలను అరికట్టవచ్చన్నారు. ప్రజలు అప్రమత్తంగా వుంటే ఈ జబ్బులు నుండి రక్షణ పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, గ్రామ ప్రజలు, సచివాలయ సిబ్బంది, పాఠశాల టీచర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

35వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుచానూరులో 35 వేల మందికి అన్నదానం చేయడం గొప్ప విషయమని తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి గొప్ప అన్నదాత అని, ప్రతి ఏడాది పంచమి తీర్థం సందర్భంగా ప్రతి శనివారం అమ్మవారి భక్తులకి అన్నదానం చేయడం గొప్ప విషయమని ఈ కార్యక్రమంలో పాల్గొనడం తనకు చాలా సంతోషంగా వుందని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. తిరుచానూరు సర్పంచ్ కె రామచంద్రా రెడ్డి ఆధ్వర్యంలో పంచమి తీర్థం సందర్భంగా అమ్మవారి భక్తులకు గురువారం సాయంత్రం ఐదు వేల మందికి పొంగలి, వడ, శుక్రవారం ఉదయం ఐదు వేల మందికి పొంగలి, వడ, శుక్రవారం 25 వేల మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ శ్రీధర్ రెడ్డి, తిరుచానూరు ఎంపిటిసి నరేష్ రెడ్డి, వేమూరు ఎంపిటిసి బి యోగానంద రెడ్డి, తిరుచానూరు ఎంపిటిసిలు, వార్డు సభ్యులు , ఆర్ఆర్ యూత్ వైసిపి నాయకులు, అమ్మవారి భక్తులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

ఎంపిడివో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

వెంకటగిరి అభివృద్ధికి కృషి : మంత్రి

ప్రజాశక్తి-వెంకటగిరి: వెంకటగిరిని అన్నీ రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషిచేస్తానని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎంపిడిఓ నూతన భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటగిరి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎంపిడిఓ, తహశీల్దారు కార్యాలయాల పనులు ప్రారంభించినట్లు గుర్తుచేశారు. ఎంపిడిఓ కార్యాలయం రూ.కోటి 60 లక్షలతో పూర్తి చేసినట్లు తెలిపారు. తహశీల్దారు కార్యాలయానికి కోటి రూపాయలు మంజూరు చేసి పనులు దాదాపు పూర్తి అయినట్లు తెలిపారు. త్వరలో మరో 30 లక్షల రూపాయలు కేటాయించి తహశీల్దారు కార్యాలయ నూతన భవనాన్ని ప్రారంభించుకోవాలని ఎమ్మెల్యేకు సూచించారు. పార్టీలకు అతీతంగా అందరూ కలిసి వెంకటగిరి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మార్చి నెలాఖరు కల్లా ఆర్అండ్‌బి, పంచాయిత్‌రాజ్ రోడ్లు పనులు పూర్తి చేసుకోవాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ మంత్రితో కలిసి వెంకటగిరి నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ, ఎంపిడిఓ కోటేశ్వరరావు, ఎంపిపి తనూజరెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, టిడిపి రూరల్ నాయకులు తంబిరెడ్డి శివారెడ్డి, రామచంద్రయ్య, పప్పు చంద్రమౌళిరెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్మార్ట్‌సిటీ పనులు వేగవంతం చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి-తిరుపతి టౌన్ : స్మార్ట్‌సిటీ నిధులతో తిరుపతి నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మరింత వేగంగా పూర్తి చేయాలని ఛైర్మన్, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కమిషనర్ ఎన్.మౌర్య అధ్యక్షతన స్మార్ట్‌సిటీ 36వ బోర్డు మీటింగ్ నిర్వహించారు. బోర్డు డైరెక్టర్లు ఎస్‌పి సుబ్బరాయుడు, ఇంజినీరింగ్ చీఫ్ డాక్టర్ రామచంద్రారెడ్డి, డాక్టర్ రమాశ్రీ, మరియన్న పాల్గొన్నారు. గత బోర్డు మీటింగ్ నిర్ణయాలు, అకౌంట్స్ గురించి వివరించారు. 85శాతం పూర్తయిన పనులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. స్మార్ట్ సిటీ జి. ఎం. చంద్రమౌళి, ఈ ఈ బి. చంద్రశేఖర్, ఏఇకామ్ ప్రతినిధి బాలాజీ పాల్గొన్నారు.

ఈఎస్‌ఐలో కార్మికశాఖ మంత్రి తనిఖీ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తిరుపతిలోని ఈఎస్‌ఐ హాస్పిటల్ని ఆకస్మికంగా శుక్రవారం తనిఖీ చేశారు. హాస్పిటల్‌లో అడ్మిట్ అయిన పేషెంట్స్‌తో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆర్‌ఓ వాటర్ ప్లాంటును తనిఖీ చేశారు. ఆలస్యంగా వస్తున్న సిబ్బందిని గుర్తించి వారిని హెచ్చరించారు. పేషెంట్స్‌కు మెరుగైన వైద్యం అందించాలని సూపరింటెండెంట్‌కు ఆదేశాలు జారీ చేశారు.

నేటి నుంచి ఎస్వీయూలో జాతీయ సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వియూ సెంట్రల్ లైబ్రరీ ఆధ్వర్యంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు సదస్సు ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రొఫెసర్ కొంగర సురేంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. టెక్నాలజీ, ఎడ్యుకేషన్ అండ్ మీడియా ఫర్ అకడమిక్ అండ్ పబ్లిక్ లైబ్రరీ ఎంపవర్మెంట్ అంశంపై ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. శనివారం ఉదయం 10 గంటలకు సెనేట్ హాల్లో ప్రారంభ సభ నిర్వహిస్తారు. ముఖ్య అతిథులుగా వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ద్రవిడ వర్సిటీ వీసీ దొరస్వామి, ఏపీ లైబ్రరీస్ అసోసియేషన్ అధ్యక్షులు కేసి కల్కురా, ఢిల్లీకి చెందిన డాక్టర్ నాగేశ్వరరావు, బెంగళూరుకు చెందిన డాక్టర్ ప్రసాద్ హాజరవుతారని చెప్పారు. ఈ సదస్సులో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రతినిధులు పరిశోధన పత్రాలు సమర్పిస్తారని సదస్సు ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రొఫెసర్ కొంగర సురేంద్రబాబు నాయుడు తెలిపారు.

రైతుల ఆదాయం పెంచండి..

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: సంప్రదాయ పంటల సాగుతో నష్ట పోతున్న రైతులను వైవిధ్యమైన పంటల సాగుకు ప్రోత్సహించి ఆదాయం పెంచాలని వ్యవసాయ శాఖ జిల్లా ట్రైనింగ్ కోఆర్డినేటర్ భాస్కరయ్య సూచించారు. స్థానిక ఏపీ సీడ్స్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన శిక్షణలో ఆయన మాట్లాడుతూ వరితోపాటు ఆరుతడి పంటలుగా కూరగాయలు, పూలు, పండ్లు, పట్టు సాగు చేపట్టుటకు రైతును ప్రోత్సహించాలని ఆయన సిబ్బందికి సూచించారు. పంటల్లో చీడల నివారణకు ఆఖరి అస్త్రంగానే రసాయన మందులు వాడాలని సూచించారు. వరి సాగులో చీడల నివారణకు చేపట్టవలసిన యాజమాన్యం గురించి జిల్లా కేంద్రం ఏవో వేణుగోపాలరావు వివరించారు. పట్టు పరిశ్రమ శాఖ రైతులకు అందిస్తున్న పథకాలు, సేవలు,గురించి శ్రీకాళహస్తి సెరికల్చర్ అధికారి కళ్యాణి సిబ్బందికి వివరించారు. ఏడీఏ రమేష్ బాబు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు ఘన నివాళులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దళితుల అభ్యున్నతికి కృషిచేసి నేడు సమాజంలో సముచిత స్థానాన్ని అందుకునేలా కృషి చేసిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా జీవకోనలో కాంగ్రెస్ తిరుపతి పట్టణ అధ్యక్షులు గౌడపేరు చిట్టి బాబు, ఎస్సీ విభాగం అధ్యక్షు లు శివశంకర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి ఘన నివాళు లు అర్పించారు. ఈ కార్యక్ర మంలో పీసీసీ ఉపాధ్యక్షులు రాంభూపాల్ రెడ్డి, నెల్లూరు జిల్లా కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మాంగాటి గోపాల్ రెడ్డి, తమటం నరసింహులు, జ్యోతిశ్వర్ నాయక్, మల్లి కార్జున, నరేంద్రబాబు పాల్గొన్నారు.

In The Court of the III Additional Junior Civil Judge:Tirupati.
O.S. No: 190 OF 2023

Y. Jangamma and another - **Plaintiffs**
VS
K.S. Venkatesh and another -**Defendants**

Summons to Defendant No:2

K.S. Chowdappa, S/o D. Srinivasappa, D. No: 13-3-392/C6, Guruvareddy quarters, Tilak Road. Tirupati Town, Tirapati urban Mandal, Tirapati Dist.

Please take summons that the plaintiff filed the above Suit against you for Permanent Injunction and the matter is posted for your appearance before the above said Court on 19-12-2024 at 10.30a.m either in person or through your counsel In the event of your failure to appear the matter will be decided exparte.

Hearing date: 19-12-2024

J. RAJA SEKHAR RAJU, B.Tech,LLB
Advocate, Tirupati.
Cell No: 7097978713

In The Court of the III Additional Junior Civil Judge:Tirupati.
I.A.No.76 of 2023
O.S. No: 190 OF 2023

Y. Jangamma and another - **Petitioners**
VS
K.S. Venkatesh and another -**Respondents**

Notice to Respondent No:2

K.S. Chowdappa, S/o D. Srinivasappa, D. No: 13-3-392/C6, Guruvareddy quarters, Tilak Road. Tirupati Town, Tirapati urban Mandal, Tirapati Dist.

Please take Notice that the Petitioner filed the above petition against you for Temporary Injunction and the matter is posted for your appearance before the above said Court on 19-12-2024 at 10.30 a.m either in person or through your counsel In the event of your failure to appear the matter will be decided exparte.

Hearing date: 19-12-2024

J. RAJA SEKHAR RAJU, B.Tech,LLB
Advocate, Tirupati.
Cell No: 7097978713